# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ రోజు అస్సోంలో పలు ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేయనున్నారు.**

**2. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో నీటిని వదులుకునేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాల బారిన పడిన విద్యార్థినులకు తక్షణమే వైద్య సాయం అందించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.**

**5. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ రోజు అస్సోంలో పలు ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేయనున్నారు. మంగళ్ డోయ్‌లోని వైద్య కళాశాల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్రహ్మపుత్ర నదిపై కొత్తగా నిర్మించిన వంతెనను ప్రారంభించనున్నారు. దేశంలోని మొట్టమొదటి వెదురు ఆధారిత బయో రిఫైనరీని గోలాఘాట్‌లో ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు.

--------------------------

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాంతి భద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. ఎస్‌పిల బదిలీల నేపథ్యంలో అన్ని జిల్లాల ఎస్‌పిలతో నిన్న ఆయన దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలతో సహా పలు అంశాలపై ఎస్‌పిలకు ముఖ్యమంత్రి దిశానిర్ధేశం చేస్తూ.. రాజకీయముసుగులో చేసే నేరాలను ఉపేక్షించవద్దన్నారు.

--------------------------

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో చుక్క నీటిని వదులుకునేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నీటి వాటాను సాధిస్తామన్నారు. ఈ అంశంపై నిన్న ఆయన

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఢిల్లీలో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ విచారణలో.. సమర్థ వాదనలు వినిపించడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ఆధారాలన్నీ న్యాయనిపుణులకు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ విచారణలో పాల్గొంటారని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లాలో పెండింగ్ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. భీమవరంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్... 30 సెకన్లు

---------------------------

చిత్తూరు జిల్లా చిరుతపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగు దాడిలో గాయపడిన అటవీ శాఖ ఉద్యోగులకు మెరుగైన చికిత్స అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ దాడి ఘటనపై నిన్న ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏనుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే కుంకీ ఏనుగులతో గస్తీ నిర్వహించాలని సూచించారు.

---------------------------

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో భారీ వర్షాలకు జలమయమైన చతులాపూర్ కాలనీని మంత్రి నిన్న పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి.. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలో బిసి రిజర్వేషన్ల బిల్లు, స్థానిక ఎన్నికలు, కార్మికుల వేతనాల పెంపు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. జిల్లాలో కొత్త బొగ్గు గనులు రావాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ..

(వాయిస్...25 సెకన్లు)

---------------------------

నెల్లూరు జిల్లా ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాల బారిన పడిన విద్యార్థినులకు తక్షణమే వైద్య సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో నిన్న ఆయన శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు గురుకుల పాఠశాల వద్దకు వెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

---------------------------

గంజాయి, డ్రగ్స్ , నాటు సారా, అక్రమ మద్యం వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. హైదరాబాదులోని నాంపల్లి ఆబ్కారీ భవన్ లో ఎక్సైజ్ శాఖ

అధికారులతో నిన్న ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో పనిచేసేవారికి అవసరమైతే ఆయుధాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణను సిబ్బందికి ఇవ్వాలని ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లాన్ని.. సేంద్రియ ఎరువుల తయారీకి రైతులకు అందించేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించాలన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు అమలు చేస్తున్న భావితరం జిఎస్టీ సంస్కరణలను రైతులు స్వాగతిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల వ్యవసాయ రంగం పురోగతి సాధిస్తుందంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దువ్వకు చెందిన డి.గోపాల కృష్ణరాజు వ్యవసాయ పరికాల ధరలు తగ్గడంతో రైతులకు మేలు జరుగుతుందని పేర్కొంటూ...

...వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కర్నూలు నగరంలో జాబ్ మేళాను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కంపెనీల అవసరాలకు తగ్గట్లుగా యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 1,650 కోట్ల రూపాయలతో పలు పరిశ్రమల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బందిపై దాడికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. చిత్తూరులోని ప్రభుత్వాసుప్రతిలో రాత్రి విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందిపై మొన్న అర్ధరాత్రి కొందరు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణ, వ్యవహారశైలిలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చెయ్యాలే తప్పా భౌతిక దాడులకు పాల్పడడం తగదని హితవు పలికారు. వైద్య సిబ్బంది నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

---------------------------

పశ్చిమ మధ్య, దాని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిషా తీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఈరోజు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్..21 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================